ప్రజాశక్తి
శనివారం 14 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం

16న సాలూరులో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ను సోమవారం సాలూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ చెప్పారు. సాలూరు ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి పిజిఆర్ఎస్ నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని ఆయన చెప్పారు. కావున జిల్లా అధికారులంతా సోమవారం సాలూరులో జరిగే పిజిఆర్ఎస్‌లో పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

వైద్య సేవలు మెరుగుపరచాలి

ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు

ప్రజాశక్తి - సాలూరు/కురుపాం

స్థానిక వంద పడకల ఆసుపత్రిలో వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధి బృందం కోరారు. శుక్రవారం ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస, జిల్లా ఉపాధ్యక్షులు కె.విజయగౌరి, నాయకులు కె.వెంకటరావు, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు రవికుమార్‌తో కూడిన బృందం సాలూరు, కురుపాం, పార్వతీపురంలో గల సిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రి, జిల్లాకేంద్రాసుపత్రిని పరిశీలించారు. ఇందులో భాగంగా సాలూరులో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని, ప్రస్తుత ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. నర్సింగ్ విద్యార్థులు చేస్తున్న రెగ్యులర్ చెకప్‌లు, పరీక్షలు, పేషంట్లతో కూడిన వార్డులు, ఎక్స్‌రే మిషన్ గదులను తనిఖీ చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పారిశుధ్య ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్ఎంఒ డాక్టర్ కాశీవిశ్వనాథ్‌ను కలిసి ఆసుపత్రిలో సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు మందకొడిగా జరుగుతుందని, దీనివల్ల ప్రస్తుతం సీజన్లో రోగుల తాకిడికి తగ్గట్టుగా బెడ్లు లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. 80 బెడ్లు మాత్రమే అందుబాటులో ఉండడం వల్ల వస్తున్న రోగులు బెడ్డకు ఇద్దరు నుంచి నలుగురు వరకు సర్దుకొని వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. పూర్తిస్థాయిలో ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్‌లు అందుబాటులో ఉండాలని, ఉన్న వైద్యుల్లో కొంతమంది సదరం డ్యూటీలకు వెళ్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. 22 మంది వైద్యులు ఆసుపత్రికి అవసరం కాగా 17మందే ఉన్నారని చెప్పారు.

సాలూరులో నిర్మాణంలో ఉన్న ఏరియా ఆసుత్రిని పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు

పారిశుధ్య సిబ్బంది ఎక్కువ మందిని నియమించాల్సి ఉందని చెప్పారు. రోగుల్లో వస్తున్న సమస్యలు ఇతర రోగులకు లేదా వారితో వచ్చే ప్రజలకు అంటకుండా ఉండాలంటే పారిశుధ్యమే కీలకమని, అవసరమైన మేరకు కార్మికులతో పాటు మెటీరియల్ కూడా ప్రభుత్వం అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో పిహెచ్‌సిలను ఏర్పాటు చేయాలని, నిర్మాణంలో ఉన్న పిహెచ్‌సిలను పూర్తి చేయాలని, వీటిలో కూడా వస్తున్న రోగులకు అవసరమైన బెడ్లు, భోజనం వసతి కల్పించాలని కోరారు. అవసరమైన మందులు సమకూరిస్తే ఏరియా ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు తగ్గి గిరిజన ప్రాంతాల్లోనే వైద్యం చేయించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

కురుపాం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక బృందం సందర్శించింది. ముందుగా వార్డులో వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్‌లో ఉన్న ల్యాబ్, ఎక్స్‌రే, మరుగుదొడ్ల గదులను సందర్శించి అక్కడున్న వసతులను, పరికరాలను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణితో మాట్లాడి రోగులకు ఉన్నటు వంటి బెడ్లు, సదుపాయాలు, మౌలిక వసతులు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలడంతో నియోజకవర్గ కేంద్రంలో గల సామాజిక ఆసుపత్రి కనుక రోగుల తాకిడి చాలా ఎక్కువగా ఉందని, బెడ్లు చాలక ఒక్కొక్క బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు చొప్పున రోగులు ఉండి వైద్యం పొందుతున్నారని అన్నారు. అదే వార్డులో చిన్నపిల్లలు, బాలింతలు ఉండడంతో ఒకరి నుంచి ఒకరికి వ్యాధులు సోకి తీవ్రత పెరిగే అవకాశం ఉందని కావున నిర్మాణం జరిగి చివరి దశలో ఉన్న 50 పడకల ఆసుపత్రిని త్వరతగతిగా నిర్మాణం పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టి ప్రారంభించాలని అప్పుడే రోగులకు మౌలిక వసతులు కొంతమేరకు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, ఎన్‌వై నాయుడు, టి.శ్రీనివాసరావ, స్థానిక నాయకులు ఎం.శ్రీనివాసరావు, కూరంగి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఒకు వినతి

పార్వతీపురం : స్థానిక 150 పడకలు అప్ గ్రేడ్ అయిన జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఆంకాలజీకి సంబంధించిన వైద్య సేవలు అందుబాటులోకి తేవాలనిః ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధులు కోరారు. స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిని పరిశీలించిన బృందం జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ నాగభూషణరావుతో చర్చించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు ఎక్కువగా ఆసుపత్రులకు వైద్యం కోసం వస్తారని, మెరుగైన వైద్యమందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పార్వతీపురం ఆసుపత్రిని 150 పడకలకు, కురుపాం ఆసుపత్రిని 50, సీతంపేట ఆసుపత్రిని 250, గుమ్మలక్ష్మీపురం ఆసుపత్రిని 50, సాలూరు ఏరియా ఆసుపత్రిని వంద పడకలకు అప్ గ్రేడ్ చేసినందున పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందాలంటే భవన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఏళ్ల తరబడి భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకే బెడ్ మీద ఇద్దరు, ముగ్గురు రోగులు పడుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. వెంటనే మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్రతినిధులు కోరారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే పని తీరుపై 'బ్లాక్ పేపర్' విడుదల చేసిన సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో పార్వతీపురం నియోజకవర్గ అభివృద్ధి శూన్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పనితీరుపై బ్లాక్ పేపర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ ప్రధానంగా పట్టణ ప్రజలు తాగునీరు, నూతన బైపాస్ రోడ్డు నిర్మాణం, టిడ్కో ఇళ్ల పంపిణీ వంటి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చేసిన ప్రయత్నం శూన్యమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే విజయచంద్ర పాత బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం సాక్షిగా పట్టణ ప్రజలకు హామీ ఇచ్చి ఏడాదైనా వాటిని పూర్తిగా విస్మరించారని వాపోయారు. దీర్ఘకాలంగా మంచినీరు, ట్రాఫిక్, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఈ పట్టణ ప్రజలను వేధిస్తున్నాయని, సుమారు 1600 మందికి గత టిడిపి ప్రభుత్వంలో కేటాయించిన టిడ్కో ఇళ్లను ప్రజలకు అందించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఆర్భాటంగా రోడ్ల మరమ్మతులు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన ప్పటికీ పార్వతీపురం శివారు ప్రాంతాలైన నవిరి కాలనీ, వెంకంపేట పరిసర ప్రాంతాల్లో నేటికీ రోడ్ల మరమ్మతులు చేయించలేకపోయారని, సీతానగరం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామన్న హామీ అమలు చేయలేకపోయారని అన్నారు. ఈ ఏడాది కాలంలో ప్రతిపక్ష కార్యకర్తల పట్ల, ప్రశ్నించే వారి పట్ల కక్షసాధింపు ధోరణితో ఎమ్మెల్యే వ్యవహరి ంచారని, చిరుద్యోగులను తొలగించడం, సంక్షేమ పథకాలను ఆపించడం, ఇళ్లు కూలగొట్టడం, స్థలాలు ఆక్రమిం చడం వంటి కక్షపూరితమైన వైఖరి అవలంబించారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అధికారపక్ష ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు పార్వతీపురం పట్టణ, నియోజకవర్గ పరిధిలో సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు కూడా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ, గొర్లి వెంకటరమణ, పి.రాజశేఖర్, ఆర్.శ్రీదేవి, పట్టణ నాయకులు ఎం.గౌరమ్మ, బి.సూరిబాబు, బి.లక్ష్మి, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

పిఎం సూర్యఘర్ లక్ష్యాలను పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పిఎం సూర్య ఘర్ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పిఎం సూర్యఘర్ కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేసి లబ్ధిదారులకు ఆసక్తి, ప్రేరణ కల్పించాలని, వారిని వెంటనే లబ్ధిదారులుగా నమోదు చేసి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు అవసరమైతే బ్యాంకు రుణాలు అందజేయాలని, బ్యాంకులు సైతం రుణాలు మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 162 మంది లబ్ధిదారులకు సోలార్ ప్యానల్‌లను బిగించారని, దీన్ని మరింత ఎక్కువగా చేపట్టి విద్యుత్తు ఛార్జీల నుంచి విముక్తి కలిగేలా లబ్ధిదారులకు తెలియజేయాలని అన్నారు. సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సభలకు సంబంధించి విధివిధానాలను రూపొందించడం జరిగిందని, వీటిని సంబంధిత అధికారులను పంపుతున్నట్టు చెప్పారు.

నేడు పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈ నెల 21న నిర్వహిస్తున్నామని, దీనికి సన్నాహక చర్యలు, యోగ అభ్యసన కింద శనివారం పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 3800 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారని, అందుకు అన్ని ఏర్పాట్లను సంబంధిత ఎంపిడిఒలు, స్థానిక అధికారులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, అన్ని శాఖల సిబ్బందిని భాగస్వామ్య సమన్వయం చేయాలని ఆయన స్పష్టం చేశారు.

15 నుండి డిఎ జుగా గ్రామ సభలు

ధాత్రి అబా జన్ జాతీయ గ్రామ ఉత్కృష్ట అభియాన్ సర్వే జూన్ 15 నుంచి 30వ వరకు నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు గ్రామాల్లో నిర్వహించే సభలు పట్ల షెడ్యూల్ తయారుచేసి ఆయా గ్రామాలకు ముందుగానే సమాచారం అందించాలని అన్నారు. గ్రామాల్లో అవసరాలకు ఇప్పటికే సర్వే ద్వారా గుర్తిస్తామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేలు ఆధారంగా జుగా గ్రామసభల్లో వాటిని వెంటనే జారీకి అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.హేమలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిసి అవినీతిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

గుమ్మలక్ష్మీపురం రాయగడ జమ్మూ పంచాయతీ క్లస్టర్ వెలుగు సిసి గరుగుబిల్లి శ్రీనివాసరావు రూ.23 లక్షలకు అవినీతికి పాల్పడ్డారని, ఆయనపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎపి గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, నాయకులు మండల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గరుగుబిల్లి శ్రీనివాసరావు గతంలో రాయగడ జమ్మూ క్లస్టర్లో పనిచేసే సందర్భంలో రూ.23 లక్షలు అవినీతికి పాల్పడితే మళ్లీ వెలుగు అధికారులు అదే క్లస్టర్లో ఆయన్ను నియమించడమంటే ఉన్నతాధికారులే అవినీతిని ప్రోత్సహిస్తున్నట్టుందని విమర్శించారు. అలాగే రాయగడ జమ్ము క్లస్టర్‌లో రాయగడ జమ్మూ, చాపరాయిబిన్నిడి, బాలేసు పంచాయతీలకు మూడు విఒఎల పరిధిలో సుమారు 14 సంఘాల నుంచి ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులను ఉన్నతి పథకం కింద గిరిజనులకు అప్పులు ఇస్తామని చెప్పి వారితో సంతకాలు చేయించుకొని శ్రీనివాసరావు రూ.23 లక్షలకు అవినీతికి పాల్పడ్డాడని అన్నారు. ఈ అవినీతిపై ఐటిడిఎ పిఒకు, ఎపిఎంలకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపించి సిసి శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకొని గిరిజనులకు డబ్బులు ఇప్పించాలని, ఆయన్ను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పువ్వల తిరుపతిరావు, బిడ్డిక శంకర్రావు, మండంగి సన్యాసిరావు , మాండంగి సుబ్బారావు పాల్గొన్నారు.

305 మందికి బదిలీ

కౌన్సిలింగ్ వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో 305 మందికి కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేశారు. అనంతరం సాయంత్రం వరకు క్లస్టర్ ఖాళీలు చూపించకపోవడంతో శుక్రవారంతో పూర్తి అవ్వాల్సిన కౌన్సిలింగ్‌ను డిఇఒ మాణిక్యం నాయుడు వాయిదా వేసినట్లు ప్రకటించారు.

క్లస్టర్ ఖాళీలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయులు

యోగాంధ్ర పోటీల్లో ప్రతిభ చూపాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను శుక్రవారం పర్యవేక్షణ చేశారు. జిల్లాలో వివిధ మండల, పట్టణ స్థాయి యోగాంధ్ర పోటీల్లో గెలుపొందిన వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో యోగా పోటీలు నిర్వహించామన్నారు. యోగా చిత్రలేఖనం, సాంగ్స్ ఎస్సే, గ్రూప్ యోగా ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. యోగా గురు మోహన్ గంటాయత్ బృందంతో కూడిన ఐదుగురు సభ్యులు జిల్లా స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని తెలిపారు. వయస్సు ప్రాతిపదికన 10నుండి18, 19నుంచి 35, 35ఏళ్ల పైబడిన వారు ఇలా గ్రూపులుగా కేటాయించడం జరిగిందన్నారు. వీరిలో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులన్నారు. యోగాంధ్ర జిల్లా కన్వీనర్ డాక్టర్ టి.జగన్మోహనరావు కార్యక్రమాన్ని షెడ్యూలు ప్రకారం జరిగేలా సమన్వయం చేస్తూ కార్యాచరణ చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో ఉత్తమమైన ప్రతిభ కనబర్చి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వారితో డిఎంహెచ్ఒ భాస్కరరావు, జిల్లా వైద్యాధికారులు

కార్యక్రమంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, హోమియో వైద్యులు డాక్టర్ సుశీల, జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ రఘు, యోగా మాస్టర్లు మోహన్ గంటాయత్, జనార్ధనరావు, డాక్టర్ హేమాక్షి, డాక్టర్ వర్మ, డాక్టర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా ఆస్థాన వైద్యులు కదులుతారా?

- 14ఏళ్లుగా జిల్లా ఆస్పత్రిలోనే తిష్ట
- బదిలీలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక జిల్లా ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్థాయికి చేరుకుంది. వంద పడకల నుంచి 150 పడకలకు పెంచారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జిల్లాలో ఎక్కువగా నిరుపేద గిరిజనులు, దళితులు, వెనుకబడిన కులాలకు చెందిన వారే వున్నారు. వీరందరికీ మెరుగైన వైద్యం అందాలంటే ఇక్కడికి రావాల్సిందే. రోజూ వందల సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. ఇలాంటి ఆసుపత్రిలో సేవా దృక్పథంతో పని చేసే వైద్యులను ప్రభుత్వం నియమించాలి. కానీ ఒకచేత్తో ప్రయివేటు నర్సింగ్ హోమ్ లను నడుపుతూ ఇలాంటి పెద్ద ఆసుపత్రిలో వైద్యులుగా పని చేయడం వల్ల పేద రోగులకు మెరుగైన వైద్యం అందే అవకాశం లేదు. ఈ ఆసుపత్రిలో గత 14 ఏళ్లుగా ముగ్గురు వైద్యులు పని చేస్తున్నారు. ఈ ముగ్గురికీ పట్టణంలో ప్రయివేటు నర్సింగ్ హోమ్‌లు ఉన్నాయి. గైనకాలజీ, సర్జరీ, ఆర్థోపెడిక్ రంగాల్లో వైద్యులైన ఈ ముగ్గురూ ఏళ్లతరబడి ఇక్కడే తిష్ట వేసి ఉన్నారు. డబ్బు, పలుకుబడి ఉపయోగించుకుని నిబంధనలకు విరుద్ధంగా ఇదే ఆసుపత్రిలో సేవలందిస్తున్న పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన తర్వాత విధిగా బదిలీ కావాల్సి ఉంది. అయితే ఈ ముగ్గురూ 14 ఏళ్లుగా ఒకేచోట పని చేయడం చర్చనీయాంశమవుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వైద్యుల బదిలీ ప్రక్రియకు సంబంధించి విధివిధానాలు రూపొందిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆస్థాన వైద్యులుగా కొనసాగుతున్న ఈ ముగ్గురూ ఇక్కడే కొనసాగేందుకు తెరవెనుక పావులు కదుపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్నతాధికారుల వద్ద ఉన్న పలుకుబడిని ఉపయోగించి బదిలీ నిబంధనలను తుంగలో తొక్కేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్పౌజ్ కోటాలో ఒక వైద్యురాలు ఇక్కడే తిష్ట వేసేందుకు పైరవీలు సాగిస్తున్నట్లు సమాచారం. ఆమె గత 14ఏళ్లుగా ఇదే ఆసుపత్రిలోలో సేవలందిస్తున్నారు. ఆమె భర్త ప్రభుత్వ కళాశాల లో అధ్యాపకునిగా పని చేస్తున్నారు. వీరికి పట్టణంలో ఓ ప్రయివేటు నర్సింగ్ హోమ్ వుంది. స్పౌజ్ కోటాను అడ్డం పెట్టుకొని ఇక్కడే కొనసాగేందుకు ఆమె ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకే అతి పెద్ద ధర్మాసుపత్రిలో వ్యాపార దృష్టితో పని చేసే వైద్యులను నియమించరాదని, సుదీర్ఘ కాలం పని చేస్తున్న వైద్యులను ఇక్కడ నుంచి బదిలీ చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

జిల్లా కేంద్రాస్పత్రి

మా పాఠశాలను తొలగించొద్దు

ప్రజాశక్తి - బలిజిపేట

స్కూల్ కమిటీ పిల్లల తల్లిదండ్రులు అంగీకారం లేకుండా తమ పాఠశాలను ఎలా తొలగిస్తారని మండలంలోని పెదపెంకి గ్రామ దళితపేటలోని ఎంపిపి స్కూల్ -1ను మోడల్ స్కూల్ పేరుతో ఎలా తొలగిస్తారని ఆ గ్రామ ప్రజలు, విద్యార్థులు పాఠశాల వద్ద శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ వాడాడ గంగరాజు, కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ పెదపెంకి దళిత కాలనీలోని ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్ పేరుతో తొలగించవద్దన్నారు. వ్యవసాయ పనుల కోసం వలసలు పోతూ వస్తూ ఉంటామని,మా ఇంటి దగ్గర ఉన్న ముసలి వారివద్ద పిల్లలను ఉంచి వలసలు పోతున్న మాకు అందుబాటులో ఈ పాఠశాల ఉండడం వల్ల ఎంతో ఉపయోగమని అన్నారు. మోడల్ స్కూల్ పేరుతో దూరాన ఉన్న ప్రాథమిక పాఠశాలకు మార్చడం వల్ల పిల్లలు చాలా ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అలాగే తుఫాను, వర్షాలు వచ్చేటప్పుడు ఇబ్బందులు పడతారని, పైగా దళితపేటలో ఉన్న స్కూల్ సుమారు 800 కుటుంబాకు ఉపయోగపడుతుందని అన్నారు. అటువంటి పాఠశాలను మోడల్ స్కూల్ పేరుతో తొలగించొద్దని కోరారు. మండల విద్యాధికారులు స్కూలు కమిటీ జరపకుండా పిల్లలు తల్లిదండ్రుల కమిటీ అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం చేయడం మంచిది కాదన్నారు. మాకు ఉపయోగపడే స్కూలు నుండి మా పిల్లలను వేరే దగ్గరకు పంపలేమని తెగేసి చెప్పారు. సిపిఎం మండల నాయకులు నల్ల ఈశ్వరరావు మాట్లాడుతూ అధికారులు ఆలోచించి పిల్లలకు అందుబాటులో ఉన్న ఈ పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దలు, స్కూలు కమిటీ సభ్యులు సావిత్రి, మచ్చ సత్యవతి, సరస్వతి, బి గౌరీ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

తల్లికి వందనం కాదు.. అమ్మకు మోసం : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన తల్లికి వందనం అమలు చేశారని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. ఇది అమ్మకు వందనం కాదని, ప్రతి అమ్మను మోసం చేసే పథకమని విమర్శించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలకు కట్టుబడి పథకాలను అమలు చేశారని చెప్పారు. అమ్మ ఒడి పథకం కింద కుటుంబంలో ఒకరికే అందజేస్తామని చెప్పి మొదటి సంవత్సరం నుంచి అమలు చేశారని చెప్పారు. అప్పుడు పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు రెండు వేల రూపాయలు కోత పెడితే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ జగన్‌ను సైకో అని విమర్శించారని చెప్పారు. ఇప్పుడు విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను ఏమని పిలవాలని ప్రశ్నించారు. టిడిపి అమలు చేస్తున్న అమ్మకు వందనం లో కూడా రెండు వేల రూపాయలు కోత విధిస్తున్నారని చెప్పారు. ఈ పథకం అమలులో ప్రభుత్వం విధించిన షరతుల వల్ల చాలా మందిని అనర్హులుగా పరిగణించే అవకాశం వుందన్నారు. 2024-25లో పథకాలు ఎగ్గొట్టి ఈ ఏడాది అమలు చేయడం ప్రజలను వంచించడమేనని చెప్పారు. అది కూడా 67లక్షల మందికే ఇవ్వడం ప్రజలను మోసగించడమేనన్నారు. నిరుద్యోగ యువతకు జాబ్ కేలండర్ ఇంతవరకు విడుదల చేయలేదని, నిరుద్యోగ భృతి మంజూరు చేయలేదని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ కులాల కార్పొరేషన్లకు కేటాయించిన నిధులనే అమ్మకు వందనం పథకానికి మళ్ళించడం తగదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు గిరిరఘు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు,సలాది అప్పలనాయుడు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్,మెంటాడ మండలనాయకులు రెడ్డి ఈశ్వరరావు, కౌన్సిలర్ లు సింగారపు ఈశ్వరరావు,గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాల్టీ 200 పడకల హాస్పిటల్‌ను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తేవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏడాది పాలన సంబరారు చేసుకుంటున్న నాయకులకు గత 8 నెలలుగా హాస్పిటల్ పనులు జరగని విషయం తెలికపోవడం విడ్డురంగా ఉందని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ఈ హాస్పిటల్ నిర్మాణం పేదలకు చాలా ఉపయోగమన్నారు. ఆరేళ్ల నుంచి ఈ హాస్పిటల్ నిర్మాణం చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని వేరొక కాంట్రాక్టు ద్వారా పనులు పూర్తి చేయాలని, లేనిచో ఆందోళన చెపడతామని హెచ్చరించారు. కార్యక్రమం లో పార్టీ నాయకులు జె.మధుసూధన్, పి.వీరన్న, ఎం.లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న గ్రంథాలయం

గ్రంథాలయ పరిసరాలు పరిశుభ్రం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక శాఖా గ్రంథాలయం పరిసరాలను లైబ్రేరియన్ లక్ష్మి శుక్రవారం శుభ్రం చేయించారు. అయ్యబాబోయ్ గ్రంథాలయమే.. అన్న శీర్షిక శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం చుట్టూ పేరుకుపోయిన పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాలను కూలీలతో శుభ్రం చేయించారు. ఇక్కడ చదివేందుకు వచ్చే పాఠకులకు మంచినీరు ఏర్పాటు చేశారు. తన తల్లి మరణించడంతో గత కొన్ని రోజులుగా రాలేకపోయానని, తాను లేకపోయినా హెల్పర్ గ్రంథాలయాన్ని తెరిచి ఉంచడం జరుగుతుంది ఆమె తెలిపారు.

సబ్సిడీపై పసుపు విత్తనాలు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రత్యేక కేంద్ర సహాయ నిధులు, గిరిజన ఉప ప్రణాళిక పథకం 2020-21 కింద ఐటిడిఎ పరిధిలో గల 20 టిఎస్‌పి మండలాల్లో (శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలు) కొత్తగా పసుపు పంటను సాగు చేసేందుకు ఆసక్తి కలిగిన గిరిజన రైతులు మీ దగ్గర్లో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా పసుపు విత్తనం తీసుకొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని పిహెచ్ఒ వెంకట గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద 90 శాతం రాయితీతో నూతన పసుపు వంగడాలైన రోమ /ప్రగతి /సేలం రకాలు అందించడం జరుగుతుంది, దీనిలో భాగంగా 90శాతం రాయితీతో ఆర్గానిక్ ఎరువులు, బ్యాటరీ స్ప్రేయర్, పసుపు ఆరబెట్టుకోవడానికి పరదాలు, ప్లాస్టిక్ కేట్స్, పసుపు ఉడకబెట్టుకోవడానికి బాయిలర్లు, పసుపు పాలిష్ మిషన్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కావున ఆసక్తి కలిగిన గిరిజన రైతులు సమగ్ర పసుపు అభివృద్ధి పథకానికి దరఖాస్తు ఈనెల 20లోగా సంబంధిత రైతుసేవా కేంద్రంలో చేయాల్సిందిగా కోరారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని కుడ్డపల్లి సమీపాన రహదారి భద్రతపై స్థానిక ఎస్సై వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. యువత మితిమీరి వేగం వెళ్లరాదన్నారు. మైనర్లకు వాహనం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా సురేష్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో జరిగిన తహశీల్దార్ల బదిలీల్లో భాగంగా శుక్రవారం స్థానిక తహశీల్దార్‌గా ఎం.సురేష్ బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా భోగాపురం తహశీల్దారుగా పనిచేసిన ఈయన మన్యం జిల్లా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని వీఆర్వోల సంఘం నాయకులు పి.పురుషోత్తం తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయ సిబ్బంది, విఆర్ఒలు తహశీల్దార్‌కు అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు తహశీల్దారుగా పనిచేసిన జయలక్ష్మి జియ్యమ్మవలస మండలానికి బదిలీపై వెళ్లారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

సాక్షి సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టుపై శుక్రవారం సుప్రీంకోర్టు స్పందించిన తీరు పట్ల మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాష్ట్రాన్ని పాలిస్తున్న చంద్రబాబు నాయుడుకు ఈ తీర్పు చెంపపెట్టుగా తాము భావిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో అక్రమ అరెస్టులు, ముఖ్యంగా వాక్ స్వాతంత్రాన్ని కట్టడి చేయాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. కొమ్మనేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం సమంజసం కాదని, 70 ఏళ్ల వయసు గల సీనియర్ పాత్రికేయుడ్ని అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని, అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని సాక్ష్యాత్తు సుప్రీంకోర్టే చీవాట్లు పెట్టిందన్నారు. ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రెడ్ బుక్ రాజ్యాంగంతో పరిపాలన చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం నాయకులకు రాష్ట్ర ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి తప్పక చెపుతారన్నారు.

చల్లంనాయుడువలసలో సంచరిస్తున్న సైబీరియా పక్షులు



అతిథులు వచ్చేశాయి...

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చల్లంనాయుడువలసకు సైబీరియా పక్షులు (తెల్లటి కొంగలు) వచ్చేశాయి. వీటి రాకతో సకాలంలో వర్షాలు వస్తాయని గ్రామస్తుల నమ్మకం. జూన్‌లో వచ్చిన ఈ పక్షులు నవంబర్ వరకు విడిది చేస్తాయి. ఈ పక్షులు ఉన్నంత కాలం వాటిని గ్రామస్తులు కాపాడుకుంటారు. గ్రామంలో పక్షులు ఉన్నంతకాలం మంచి జరుగుతుందని ప్రజల నమ్మకం.

ఐటిఐ ప్రిన్సిపల్‌గా శ్రీనివాస్ ఆచారి

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్‌గా శ్రీనివాస్ ఆచారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ ప్రిన్సిపల్‌గా పని చేసిన రవికుమార్ బదిలీపై వెళ్లారు. శ్రీనివాస్ ఆచారి గతంలో రాజాం, నర్సీపట్నంలో ఐటిఐ ప్రిన్సిపల్‌గా పని చేశారు. ఐటిఐ అభివృద్ధికి పని చేసిన అధికారిగా ఆయనకు గుర్తింపు ఉంది.

18న క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 18న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్లేస్ మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు చెప్పారు. ఎల్ అండ్ టి, కార్బన్ రిసార్ట్స్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని పిఒ శ్రీనివాసరావు కోరారు.

ఏడాదికే హైస్కూల్ ప్లస్‌కు మంగళం?

- అగమ్యగోచరంగా విద్యార్థుల పరిస్థితి
- సెకండ్ ఇయర్ విద్యార్థులు ఉంటారా? ఊడుతారా?

ప్రజాశక్తి-సీతంపేట

మండల కేంద్రం సీతంపేటలో గత ఏడాది ఏర్పాటు చేసిన హైస్కూలు ప్లస్ కళాశాలకు ఏడాదిలోనే మంగళం పాడేశారు. ఎన్నోఏళ్ల కల నెరవేరిందని సంబరపడిన విద్యార్థులకు తీవ్ర నిరాశే ఎందురైంది. ఆదిలోనే అంతమైపోవడంతో తీవ్ర విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

ఐటిడిఎ కేంద్రమైన సీతంపేటలో జూనియర్ కళాశాల లేక ఇక్కడ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేవలం గిరిజన విద్యార్థులకు మాత్రమే రెండు గురుకుల కళాశాలు ఉన్నాయి. ఆ కళాశాలలు కూడా ఈ మండలంలో చదువుకున్న గిరిజన విద్యార్థులకు సరిపోవు. కొన్నాళ్లగా ఇక్కడ విద్యార్థులు. పక్క మండలాలకు వెళ్లి బస్సుల్లో ప్రయాణం చేసి చదువుకునే సందర్భాలు ఉన్నాయి. అయితే సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను హై స్కూల్ ప్లస్ కళాశాలగా మారుస్తూ గత ఏడాది జూన్‌లో ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుండి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విద్యార్థులంతా తమ కల నెరవేరిందని భావించారు. గత ఏడాది ఎంపిసి, బైపిసి గ్రూపులు ప్రారంభించారు. సుమారు 70 మంది వరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. ఈ కళాశాలలో అధ్యాపకులను నియమించలేదని కొందరు విద్యార్థులు కొన్ని రోజులు తరువాత వేరే కళాశాలకు వెళ్లిపోయారు. హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఈ ఏడాది సెకెండ్ ఇయర్‌కు కూడా వచ్చారు. ఇంతలోనే. డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుండి 2024లో ప్రారంభించిన రాష్ట్ర వ్యాప్తంగా 210 హైస్కూల్స్ ప్లస్ స్కూళ్లను రద్దు చేస్తున్నటుల తీర్మానం పంపాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు, హెచ్‌ఎం కలిసి స్కూల్ కమిటీ ద్వారా తీర్మానం చేసి పంపించినట్లు సమాచారం. ఇప్పటికే గురుగుబిల్లి హైస్కూల్ ప్లస్ ఎత్తివేసినట్లు సమాచారం.

ప్రస్తుతం ఈ ఏడాది హై స్కూల్ ప్లస్ లో మొదటి సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్లు జరగలేదు. దాంతో పాటు మొదటి సంవత్సరం నూరు శాతం ఉత్తీర్ణత సాధించి సెకండ్‌కు వెళ్లనున్నారు. అయితే వీరి పరిస్థితి ఏమిటన్నది ఆగమ్య గోచరంగా ఉంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎటూ తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారు. సీతంపేటలో కళాశాల ఉందా లేదో ఎటు తేల్చుకొని స్థితిలో ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులు మాత్రం పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటూ దర్శనమిస్తున్నారు. దీనిపై హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు వద్ద ప్రస్తావించగా తనకేమీ ఇంకా తెలియదని, కొద్దిరోజుల క్రితమే బదిలీపై వచ్చానని తెలిపారు.

తెరుచుకోని హై స్కూల్ ప్లస్ కళాశాల

హైస్కూల్ ప్లస్ ఉండదు

ఈ ఏడాది హైస్కూల్ ప్లస్ టు ఉండదు. ద్వితీయ సంవత్సరం మాత్రం సెకండ్ ఇయర్ విద్యార్థులతో కొనసాగుతుంది. అయితే హై స్కూల్ ప్లస్ మాత్రం ఎత్తివేసినట్లు స్కూల్ కమిటీ తీర్మానం చేసి విద్యశాఖకు పంపింది.

ఆనందరావు ఎంఇఒ
సీతంపేట మండలం.

ఏడాదిలోనే ప్రజల్లో అసంతృప్తి : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే ప్రజల అసంతృప్తి ఎదుర్కొంటుందని, జిల్లాలోని ప్రజా సమస్యలు పరిష్కరించి విజయోత్సవాలు జరపాలని సిపిఎం నాయకులు అన్నారు. కూటమి ఏడాది పాలనపై సీతానగరం శుక్రవారం నిరసన చేపట్టిరు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వర రావు, మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం జిల్లా, ఈ మండల ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీనీ అమలు చేయలేదని, సూపర్ సిక్స్ ఇస్తామని చెప్పి ఇంతవరకూ పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. జిల్లాలో అతి తక్కువ ఖర్చుతో సాగునీటి ప్రాజెక్టు పూర్తవుతాయని, ఆదిశగా పాలకులు చర్యలు తీసుకోలేదన్నారు. గోదావరి - బనకచర్లకు రూ.80వేల కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్ట్ కడతామని చంద్రబాబు నాయుడు ప్రకటిస్తున్నారని మన్యం జిల్లాలో సీతానగరం మండలానికి జంఝావతి నీరు రావడంలేదని, అది పూర్తి చేయడానికి శ్రద్ధ లేదని, కొత్తవలస ఆనకట్టు, వెంగళరాయ మిగులు జలాలు చివర భూములకు అందించేందుకు రిజర్వాయర్ల మరమ్మతులు, కాలువల పూడికలు తీయకుండా తీసినట్టు రికార్డుల్లో చూపిస్తున్నారని విమర్శించారు. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు వైద్యం అందించలేని పరిస్థితిలో ఉందని, దీనికోసం ఈ కూటమి ప్రభుత్వానికి పట్టలేదని, మండల ప్రజల వైద్యారోగ్యం కోసం స్థానిక ఎమ్మెల్యేకు శ్రద్ధ లేదని విమర్శించారు. 8 వారాలుగా ఉపాధి బకాయిలు ఇవ్వలేదని, అయినా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని అన్నారు. లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామన్న బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలకు ఇప్పుడా ఫ్యాక్టరీ ఎక్కడ ఉందో తెలియదని ఎద్దేవా చేశారు. వెంటనే ఫ్యాక్టరీని తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో నివాసం ఉన్న ఏనుగులను ఎప్పుడు తరలిస్తారని ప్రశ్నించారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చేసి అప్పుడు సంబరాలు జరుపుకోవాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, ఆర్.రాము, బి.అప్పారావు, సిహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

'తల్లికి వందనం'తో ఆనందం : బోనెల

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలు చేయడంతో సమాజంలో అన్ని వర్గాల ప్రజల్లోనూ ఆనందం వ్యక్తమవుతుందని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఒక ఇంట్లో ఎంతమంది చదువుకుంటున్న పిల్లలున్నా అందరికీ పథకాన్ని వర్తింప జేస్తూ ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున నిధులు మంజూరు చేయడంతో తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అన్ని హామీలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు నాయకత్వం పట్ల ప్రజల్లో ఆదరాభిమానాలు మరింత పెరిగాయని పేర్కొన్నారు. త్వరలోనే రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు కానున్నాయని తెలిపారు.

ఇప్పట్లో ఆ బస్సులు రానట్లే!

అడ్డంకిగా విద్యుత్ స్తంభాలు
జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే తప్పని అవస్థలు

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువ నుంచి పార్వతీపురానికి స్థానికులు వెళ్లాలంటే ఇప్పట్లో అవస్థలు తీరేలా లేవు. సుమారు రూ.37 కోట్లతో చినబోగిలి -మక్కువ రహదారి పనులు కొనసాగుతున్నాయి. అయితే గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతుండడం వల్ల అటు కాంట్రాక్టర్‌కు ఇటు ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. వెంకట బైరిపురంలో సిసి రోడ్డు నిర్మాణం చేపడుతుండడంతో గత పది రోజులుగా పార్వతీపురం నుంచి ఆర్టీసీ బస్సులు మక్కువకు రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటబైరిపురం వరకు మాత్రమే ఆర్టీసీ బస్సులను నడుపుతుంది. ఇక్కడ రహదారికి అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉండడంతో పెద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెంకటబైరిపురంలో పూర్తిస్థాయిలో విద్యుత్ శాఖ పునరుద్ధరణ పనులు చేపడితే తప్ప పార్వతీపురం నుంచి మక్కువకు ఆర్టీసీ బస్సులు వచ్చే పరిస్థితి లేదు. వెంకట బైరిపురంలో ప్రత్యామ్నాయ రహదారి సౌకర్యం కూడా లేకపోవడం కూడా ఒక కారణంగా ఉంది. మరోవైపు కాంట్రాక్టర్ బిటి రహదారి పూర్తిస్థాయిలో నిర్మించినప్పటికీ

వెంకటబైరిపురంలో నిర్మాణంలో ఉన్న సిసి రోడ్డు

గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణం తలనొప్పిగా మారుతుంది. కొయ్యన్నపేటలో సిసి రోడ్డు నిర్మాణానికి మరింత జాప్యమయ్యే ఆస్కారం కూడా లేకపోలేదని పలువురు భావిస్తున్నారు. ఈ గ్రామంలో రహదారికి ఇరువైపులా ఉన్న గృహస్తులు సహకరిస్తే తప్ప పనులు ముందుకు సాగని పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు. ఇన్ని సమస్యల నడుమ పార్వతీపురం నుంచి మక్కువకు బస్సు సౌకర్యం కలగాలంటే ఇప్పట్లో జరిగేలా లేదని పలువురు అంటున్నారు. ఆర్టీసీ అధికారులు పాత బొబ్బిలి మీదుగా మక్కువకు బస్సులు నడపాలని కోరుతున్నారు. అలాగే గ్రామాల్లో ఆటంకంగా ఉండే విద్యుత్ స్తంభాలను కూడా పునరుద్ధరించే పనులు అటు కాంట్రాక్టర్ ఇటు అధికారులు వెంటనే చేపట్టి ప్రజలకు అవస్థలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా జయరాం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.జయరాం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జివిఎంసిలో శానిటరీ అధికారిగా పని చేస్తున్న జయరాంను ఇక్కడ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పని చేసిన కమిషనర్ డిటివి కృష్ణారావు బదిలీపై వెళ్ళిపోయారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జయరాంను మున్సిపల్ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జయరాం

పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చాలని, నిరుపయోగంగా ఉన్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు నిధులు కేటాయించి పూర్తి చేయాలని సిపిఎం బృందం డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక పిహెచ్‌సిని సిపిఎం మండల కమిటీ సందర్శించి అక్కడున్న సమస్యలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, గేదెల సత్యనారాయణ, బొద్దాన భానుమూర్తి మాట్లాడుతూ బలిజిపేట పిహెచ్‌సిలో ఔట్ పేషెంట్ 70 నుంచి 100 వరకు, ఇన్‌పేషెంట్లు ఐదు నుంచి పది వరకు వస్తున్నారన్నారు. ఆస్పత్రిలో ముగ్గురు సూపర్‌వైజర్లు, ఎంఎన్‌ఒఎస్ పోస్టులు ఖాళీలు భర్తీ చేయాలని, కరోనా రోగుల కోసం ప్రారంభించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిరుపయోగంగా ఉందని, ఆ భవనాన్ని పూర్తి చేయాలని కోరారు. ఆసుపత్రికి రావడానికి వర్షం పడితే ఇబ్బంది కలిగే పరిస్థితి ఉందని, కావున సిసి రోడ్డు నిర్మించాలని, మందుల సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నల్ల ఈశ్వరరావు, దన్నాన త్రినాధ్, బలరాంనాయుడు, గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న పాఠశాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఏడేళ్లయినా పూర్తికాని ఆశ్రమ పాఠశాల : సిపిఎం

ప్రజాశక్తి -కొమరాడ

ఏడేళ్లయినా గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాల భవనం పూర్తి కాకపోవడం దారుణమని సిపిఎం నాయకులు కొల్లి సాము మూర్తి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల నిర్మాణ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలో మొట్టమొదటిసారిగా నిర్మించిన బాలికల ఆశ్రమ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో కొత్త ఆశ్రమ పాఠశాల నిర్మిస్తామని 2019లో రూ.3.50కోట్లతో పనులు ప్రారంభించి పునాదులు, ప్రహరీ గోడ కట్టి వదిలేశారని అన్నారు. ఆ పనిపై ఐటిడిఎ అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఇక్కడ చదువుతున్న బాలిక విద్యార్థులు కొమరాడ గిరిజన గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాల వద్దకు తరలించడంతో సౌకర్యాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికి ఏడేళ్లయినా ఇక్కడ ఆశ్రమం పాఠశాల పూర్తిగా పనులు చేయకపోవడం ఒక వంతయితే మరోపక్క బాలురు చదువుతున్న గిరిజన రెసిడెన్షియల్ పాఠశాల పక్కన చదువుతున్న బాలికలకు అనేక ఇబ్బందికరమైన సంఘటన ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తుందన్నారు. కాబట్టి వెంటనే ఐటిడిఎ అధికారులు దృష్టి సాధించాలని కోరారు.

కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వెంకటేష్, రామస్వామి, రామారావు, బోడియ్య పాల్గొన్నారు.

62 ఏళ్ల వయోపరిమితి అమలు చేయాలి

ప్రజావక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీవోలు వెంటనే జారీ చేయాలని, ఆశా వర్కర్లకు 62 సంవత్సరాల వయోపరిమితిని అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కోరారు. సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాన్ని అమలు చేయాలని, ఇటీవల కొంతమంది ఆశావర్కర్లు రిటైర్ కావడం వల్ల ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్ పొందలేకపోతున్నారని చెప్పారు. పెన్షన్, గ్రాడ్యుటీ లేకుండా ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. పిహెచ్‌సిల్లో పని చేస్తున్న ఆశా వర్కర్లు ఏ విధంగా జీవించాలని ప్రశ్నించారు. ఆశావర్కర్లకు సెల్ ఫోన్లు, సిమ్ కార్డులు పంపిణీ చేయాలని కోరారు. బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం నాయకులు దమయంతి, లక్ష్మి,పారమ్మ వున్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని మామిడిమానుగూడ మోడల్ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆరోగ్యంపై విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కెటివి పోలినాయుడు, సూపర్వైజర్ శాంతి కుమారి, సిహెచ్ఒ, ఎఎన్ఎం, హెల్త్ సహాయకులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆరోగ్య సూచనలు ఇస్తున్న సూపర్‌వైజర్ శాంతికుమారి

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీలోని రెల్లివీధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నగర పంచాయతీ చైర్మన్ ఆకులు మల్లేశ్వరి, కమిషనర్ రత్నరాజుకు రెల్లి సంఘం ప్రతినిధులు బాలరాజు, మజ్జి బాబ్జీ తదితరులు శుక్రవారం వినతిని పత్రం అందజేశారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రెల్లి వీధికి ఆనుకొని రింగ్ రోడ్డు ఉందని రోడ్డంతా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయిందని అన్నారు. దీనివల్ల నడకకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు ఈ సమస్యలపై వారు సానుకూలంగా స్పందించారు.

పెండింగ్ డైట్ బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పెండింగ్ లో ఉన్న గిరిజన సంక్షేమ వసతిగృహాల డైట్ బిల్లులు విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్లా సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలోనే వసతిగృహాల డైట్ బిల్లులు పెండింగులో ఉన్నాయని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో నాలుగైదు నెలలు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచాలని కోరారు. డైట్ చార్జీలు పెంచకపోవడం తో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

రహదారిపై మురుగు నీరు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని బాబూ జగజ్జీవన్‌రామ్ కాలనీలో దళితులు మురికి నీటిపై రాకపోకలు సాగిస్తున్నారు. జగజ్జీవన్‌రామ్ కాలనీలోనే కాలువల్లో కొంతకాలం నుంచి చెత్తాచెదారాలు తొలగించకపోవడంతో వాడుక నీరంతా రహదారిపై ప్రవహించడంతో వాటి పైన దళితులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలోనే చెత్తాచెదారాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తాళం వేసి ఉన్న చినగోర గ్రామ సచివాలయం

సమావేశాలకు వెళ్తే సచివాలయానికి తాళమే!

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చినగోర సచివాలయం ఉదయం 12:32 సమయమైనా తెరుచుకోలేదు. ఈ విషయమై ఎంపిడిఒ బి.వెంకటరమణతో ఫోన్లో మాట్లాడగా కలెక్టర్ మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ సహాయకులు, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు వీడియో కాన్ఫరెన్స్ ఉందని వివరణ ఇచ్చారు. మిగిలిన ఉద్యోగులు కూడా హాజరు కావాలని, 'ప్రజాశక్తి' ప్రశ్నించగా జవాబు రాలేదు. సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఇద్దరు, డిజిటల్ సహాయకులు ఒకరు, మహిళా పోలీసు, విఎఎ, విఆర్ఒ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ డిప్యూటేషన్ పై సీతంపేట వెళ్లారు. ఇంజనీరింగ్ సహాయకులకు జీతభత్యాలు ఈ సచివాలయంలో చెల్లింపులు జరుగుతున్నట్లు వినికిడి. ఇద్దరు కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు సమావేశాలకు వస్తే సచివాలయానికి తాళాలేనా? స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మిగిలిన ఉద్యోగులు సచివాలయానికి రావాలి కదా? అంటూ సచివాలయ ఉద్యోగులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా సవరపు

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లా చర్మకారుల సంఘం అధ్యక్షులుగా సవరపు రామారావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు ఇసుకర భాస్కరరావు నియామక పత్రాన్ని పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సంఘం గౌరవ అధ్యక్షులుగా పనిచేస్తున్నానని, చర్మకారుల సమస్యల పరిష్కారం కృషి చేస్తానని తెలిపారు. తనపై ఉన్న నమ్మకానికి అనుగుణంగా పని చేస్తానన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న రామారావు